www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి | భద్రాద్రి
శుక్రవారం | 30 | జనవరి | 2026 | పేజీలు : 7

## పిల్లల్లో పఠన సామర్థ్యం పెంచాలి




-ప్రతి రోజు ఎఫ్రీ చైల్డ్ రీడ్ క్లాసులు నిర్వహించాలి
-సమీక్షా సమావేశంలో కలెక్టర్

2లో

# అద్దె ప్రచారం షురూ..!



-మొదలైన ఎన్నికల ప్రచార సందడి
-గిట్టుబాట అవుతుందంటున్న అద్దె ప్రచారకులు



ప్రజాపక్షం/ ఖమ్మం : ఇప్పుడు రెడీమెడ్ యుగం నడుస్తుంది. కావాలనుకుంటే నిమిషాల మీద అన్ని సిద్ధమవుతున్నాయి. ఇప్పుడు రాజకీయ పార్టీలకు పని చేసేందుకు కార్యకర్తలు కూడా రెడీమెడ్‌గా దొరుకుతున్నారు. గతంలో పార్టీలకు అంకితభావం కలిగిన కార్యకర్తలు ఉండేవారు. పార్టీ కార్యక్రమాల్లో వారే పాల్గొనడంతో పాటు ఎన్నికల సమయంలో రాత్రి, పగలు అనే తేడా లేకుండా పార్టీల అభ్యర్థుల గెలుపు కోసం పనిచేసే వారు. ఇప్పుడు రాజకీయ పార్టీలకు అంత అంకితభావం కలిగిన కార్యకర్తలు లేరు. కమ్యూనిస్టులను మినహాయిస్తే నాయకులు కూడా ఏ ఎన్నికలకు ఏ పార్టీలో ఉంటారో తెలియని పరిస్థితి. అందువల్ల ఆయా ఎన్నికలకు అనుగుణంగా రెడీమెడ్ కార్యకర్తలను వాడుకుంటున్నారు. ఎన్నికల్లో ఖర్చుతో పాటు ప్రచారం ద్వారా ఓటర్లను ఆకర్షించడం అనేది ఆనాదిగా వస్తుంది. ఇప్పుడు ఆ ప్రచారానికి అద్దె కార్యకర్తలు విరివిగా దొరుకుతున్నారు. ఈ కార్యకర్తలను సరఫరా చేసేందుకు కొందరు బ్రోకర్లు కాస్త నాజుగ్గా చెప్పాలంటే ఏజెన్సీలు వెలిశాయి. ఎంత మంది కార్యకర్తలు కావాలి, ఎన్ని గంటల వరకు ప్రచారం నిర్వహించాలి, ఇంటింటి ప్రచారమా లేక ర్యాలీలా, వీటితో పాటు దూర ప్రాంతపు సభలకు

మిగతా 2లో..

## కలెక్టర్ గారూ..
## మా ఆరోగ్యాలు కాపాడండి




ప్రజాపక్షం/చర్ల ః మండల కేంద్రంలో ఇసుకలారీల రద్దీతో ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. ప్రతీ రోజూ సుమారు

మిగతా 2లో..

- చర్లను కమ్మేసిన ఇసుక కాలుష్యం
- ఇసుక రవాణా పేరుతో ప్రజలపై కాలుష్య దాడి

## నేడే నామినేషన్లకు
# తుది గడువు



ప్రజాపక్షం/ఖమ్మం : మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఘట్టానికి నేటితో తెర పడనుంది. శుక్రవారం సాయంత్రం ఐదు గంటల వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. రాజకీయ పార్టీలు అభ్యర్థుల ఎంపిక, పొత్తుల చర్చల్లో నిమగ్నమయ్యాయి. ఆయా మున్సిపాలిటీలలో ఎడతెగకుండా చర్చలు సాగుతున్నాయి. సంఖ్య కుదిరిన చోట

-అభ్యర్థుల ఎంపిక, పొత్తుల చర్చల్లో పార్టీలు

మిగతా 2లో..

# అద్దె ప్రచారం షురూ..!

(మొదటిపేజీ తరువాయి)

వెల్లాలా అనే దానిని బట్టి కూలీ నిర్ణయిస్తారు. అందులో మహిళలు లేక పురుషలా వీటితో పాటు మాస్ లేక క్లాస్ వీటిని బట్టి ఏజెన్సీలు ధర నిర్ణయిస్తాయి. బరిలో నిలిచిన అభ్యర్థి ఎలా కోరితే అలా ఎన్నికల ప్రచారకులను సిద్ధం చేస్తున్నారు. ఇంకా కొన్ని సందర్భాల్లో మద్యం, బిర్యానీలు అదనపు భారంగా ఉంటాయి. ఇది కొంత కాలంగా నడుస్తున్న ట్రెండ్. ఆ ట్రెండ్‌కు అనుగుణంగానే ఇప్పుడు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో అద్దె ప్రచారం ప్రారంభమైంది. ఒక పక్క నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుండగానే మరి కొందరు ప్రచారాన్ని ప్రారంభించారు. స్వతంత్రులతో పాటు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు ప్రకటించిన అభ్యర్థులు ఆయా డివిజన్లు లేదా వార్డుల్లో ప్రచారాన్ని ప్రారంభించారు. మరి కొందరు నామినేషన్ వేసేటప్పుడే బలప్రదర్శన నిర్వహించాలని నామినేషన్ల సందర్భంగా భారీ ఊరేగింపులు పెడుతున్నారు. ఇందుకు కూడా అద్దె కార్యకర్తలే అవసరం అవుతున్నారు. ఏజెన్సీలు లేదా బ్రోకర్లు ప్రచారకుల కూలీ పోను అదనంగా ఆయా అభ్యర్థుల నుంచి రాబడుతున్నారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఇప్పుడు మళ్లీ అద్దె కార్యకర్తల అవసరం పెరిగింది. నామినేషన్లు వేయగానే నామినేషన్ కేంద్రాల వద్ద ఉన్న కొందరు బ్రోకర్లు ప్రచారానికి మనుషులు కావాలంటే చెప్పండి సారూ అంటూ ఫోన్ నెంబర్లు ఇస్తుండటం గమనార్హం. గతేడాది డిసెంబర్‌లో జరిగిన పంచాయతీ ఎన్నికల సందర్భంగా చాలా గ్రామ పంచాయతీల్లో రోజు వారి కూలీలు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఖమ్మం జిల్లాలో ఓ అభ్యర్థి చివరి రోజు 1,800 ఓట్లు ఉన్న గ్రామ పంచాయతీలో 800 మందితో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని చూసిన కొందరు ఓటర్లు ఈ అభ్యర్థి గెలుపు ఖాయం అనుకున్నారు. కానీ చివరకు ఆ అభ్యర్థికి



350 ఓట్లకు మించలేదు. ఆ ఊరేగింపు అంతా అద్దె కార్యకర్తలే. కొన్ని ప్రాంతాల్లో ఉదయం ఒక పార్టీకి సాయంత్రం మరో పార్టీకి ప్రచారం నిర్వహిస్తున్నారు. అదే ప్రాంతంలో ఉదయం ఒక గుర్తు, సాయంత్రం మరో గుర్తుకు ఓటేయమని చెబుతుండడంతో ఓటర్లు ఆశ్చర్యపోతున్నారు. ఓటర్లు విస్తుపోవడం అభ్యర్థులు ఖర్చు చేయడం పక్కనపెడితే అద్దె ప్రచారకులు మాత్రం ఎన్నికల



సందర్భంగా కాస్త బాగానే గిట్టుబాటు అవుతుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీల్లో ప్రచారం చేసేందుకు గ్రామీణ ప్రాంతాల నుంచి యువకులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. సరదాకు సరదా డబ్బుకు డబ్బు వస్తుండడంతో ఈ అద్దె ప్రచారం పట్ల ఎక్కువ మంది మక్కువ చూపుతున్నారు. రెడీమెడ్ యుగంలో అందుకు అనుగుణంగానే ఎన్నికల ప్రచారాలు సాగుతుండటం గమనార్హం.

# నేడే నామినేషన్లకు తుది గడువు

(మొదటిపేజీ తరువాయి)

వార్డుల విషయంలో బేధాభిప్రాయాలు రావడం కొన్ని చోట్ల సంఖ్యపై తేడాలు రావడం తదితర కారణాలతో పొత్తులు అనుకున్న రీతిలో కుదరడం లేదు. చివరి నిమిషం వరకు పొత్తులకు ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. కొన్ని చోట్ల నామినేషన్లు వేద్దాం తర్వాత కూర్చుని చర్చించుకుందామనే రీతిలో రాజకీయ పార్టీలు వ్యవహరిస్తున్నాయి.

**రెండవ రోజు భారీగా నామినేషన్లు :**

మున్సిపల్ నామినేషన్ల ప్రక్రియలో భాగంగా రెండవ రోజున భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెంజిల్లాలోని కొత్తగూడెం కార్పొరేషన్, ఇల్లందు, అశ్వారావుపేట మున్సిపాలిటీతో కలిపి 224 నామినేషన్లు దాఖలయ్యాయి. అశ్వారావుపేటలో 58, ఇల్లందులో 66, కొత్తగూడెం కార్పొరేషన్‌లో 60 వార్డులకు గాను 100 నామినేషన్లు దాఖలయ్యాయి. ఖమ్మం జిల్లాలో కల్లూరు మున్సిపాలిటీకి రెండవ



రోజున 76 నామినేషన్లు దాఖలు కాగా వైరాలో 62 నామినేషన్లు దాఖలయ్యాయి. మధిరలో 29, ఏదులాపురంలో 87 నామినేషన్లు, సత్తుపల్లిలో 23 వార్డులకు గానూ 62 నామినేషన్లు దాఖలయ్యాయి. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు చాలా మంది రెండవ రోజున నామినేషన్లు దాఖలు చేశారు.

# కలెక్టర్ గారూ..
# మా ఆరోగ్యాలు కాపాడండి



(మొదటిపేజీ తరువాయి)

200 నుండి 300 లారీలు ఇసుక రీచ్‌లకు వచ్చి తిరిగి భద్రాచలం వైపు వెళుతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇసుక లారీలు అతి వేగంతో ప్రయాణిస్తుండటంతో భారీగా దుమ్ము ఎగిసి పడుతోంది. రాత్రి, పగలు తేడా లేకుండా లారీల డ్రైవర్లు అనవసరంగా హారన్లు మోగిస్తుండటంతో మరో ప్రక్క శబ్ధ కాలుష్యం కూడా పెరిగిపోతోంది. తద్వారా ప్రజలు నిద్రకు తీవ్ర భంగం కలుగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో పిల్లలు, వృద్ధులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీగా దుమ్ము ఎగిసి పడుతుండటంతో శ్వాస సంబంధిత సమస్యలు, తలనొప్పి, నిద్రలేమి వంటి ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని, రహదార్లపై కనీసం నీటిని చల్లక పోవడం వల్ల దుమ్ము మరింత ఎక్కువగా వ్యాపిస్తోందని వారు వాపోతున్నారు. ఇసుక లారీల మితిమీరిన వేగం కారణంగా గ్రామీణ రహదారులు, చర్ల భద్రాచలం ఆర్అండ్‌బి రహదారి పూర్తిగా ధ్వంసమై పోతుంది. ఇది పర్యావరణ పరిరక్షణ చట్టం (1986), ఎయిర్ యాక్ట్ (1981), వాయిస్ పొల్యూషన్ (2000), మోటార్ వెహికిల్ యాక్టు వంటి చట్టాల ఉల్లంఘన క్రిందికే వస్తుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. అతి వేగంగా ప్రయాణించే లారీల వల్ల రోడ్డు దాటాలంటే విద్యార్థులు, వృద్ధులు హడలెత్తిపోతున్నారు. ఇది పబ్లిక్ ప్రాపర్టీ డ్యామేజ్ యాక్ట్, వెహికల్ యాక్ట్ (1988) ప్రకారం ప్రజలు మండిపడుతున్నారు. తక్షణమే పోలీసు, రెవెన్యూశాఖలు జోక్యం చేసుకుని రాత్రివేళల్లో ఇసుక రవాణాలను నిషేదించాలని, దుమ్ము నివారణకు రహదారులపై క్రమం తప్పకుండా నీటిని చల్లించాలని, జన సామ్మర్థం ఉన్న ప్రాంతాల్లో లారీల వేగాన్ని నియంత్రించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి చర్ల మండల ప్రజలను వాయి, శబ్ధ కాలుష్యం నుంచి కాపాడాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# పిల్లల్లో పఠన సామర్థ్యం పెంచాలి




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు వంద శాతం ఇంగ్లీష్ పఠన సామర్థ్యం ఉండాలనే ఉద్దేశంతో రూపొందించిన ఎఫ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. గురువారం భక్తరామదాసు కళాక్షేత్రంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ లతో కలిసి విద్యాశాఖాధికారులు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులతో ఎవ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలాల్లో స్కూల్స్ వారీగా విద్యార్థుల పఠన సామర్థ్య ఫలితాలపై సమీక్షించారు. ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎవ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమానికి ప్రతి రోజు గంట సమయం ప్రాథమిక పాఠశాల్లోని విద్యార్థుల రీడింగ్ స్కిల్స్ పెంచేందుకు కేటాయించాలన్నారు. ప్రతి రోజు మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఒకటి నుంచి ఐదు తరగతులు చదివే పిల్లలకు ఎవ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో పఠన సామర్థ్యాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈసిఆర్ ప్రారంభించిన మొదటి వారం నుంచి విద్యార్థుల హాజరు శాతం పెరిగిందని ఇది పిల్లలకు జీవిత కాలం ఉపయోగపడే సామర్థ్యాన్ని మనం అందిస్తున్నామని తెలిపారు. రెండవ దశ ఎవ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమ అమలులో పదాలు చదివే సామర్థ్యం ఉన్న పిల్లలు వ్యాఖ్యాలు చదివేలా, అక్షరాలను చదివే పిల్లలు పదాలు చదివేలా కృషి చేయాలని తెలిపారు. మంచి ఫలితాలను అందిస్తున్న ఉపాధ్యాయులను కలెక్టర్ అభినందించారు. ఆంగ్ల భాష ఫోనోటిక్స్ బేసిక్‌గా ప్రతి ఆంగ్ల అక్షరం ఎటువంటి సౌండ్ చేస్తుందనేది విద్యార్థులకు తెలిసేలా ఉపాధ్యాయుల బోధన ఉండాలన్నారు. పాఠశాలల్లో హాజరు శాతాన్ని పెంచాలన్నారు. ఉపాధ్యాయుల హాజరు అధికారులు పర్యవేక్షించాలని, అనుమతి లేని గైర్హాజరును ఉపేక్షించేది లేదన్నారు. ఫిబ్రవరి నెల చాలా కీలకమని కలెక్టర్ తెలిపారు. లక్ష్య సాధనకు ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు చొరవ చూపాలన్నారు. వెనకబడిన పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎవ్రీ చైల్డ్ రీడ్స్‌లో ప్రతిభ కనబర్చిన ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులను కలెక్టర్ సన్మానించారు.ఈ కార్యక్రమంలో జెడ్పి సిఈవో దీక్షారైనా, డిఈవో చైతన్యజైని, విద్యాశాఖ ప్లానింగ్ కో ఆర్డినేటర్ సిహెచ్ రామకృష్ణ, సిఎంవో ప్రవీణ్, ఆర్ఎంవో ప్రభాకర్‌రెడ్డి, మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల విధులపట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**- జిల్లాలో ప్రశాంతమైన వాతావరణంలో నామినేషన్ల ఘట్టం**
**కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచన**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఎన్నికల విధుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. బుధవారం ఏదులాపురంమున్సిపాలిటీపరిలోని 32వార్డులకు నిర్వహించనున్న ఎన్నికల కోసం మండలపరిషత్‌కార్యాయలంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కౌంటర్లను తనిఖీ చేశారు. అలాగే అభ్యర్థులు సమర్పించిన నామినేషన్ పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చిన అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, హెల్ప్‌డెస్క్‌లో అన్నిరకాల ఫామ్స్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికల నియమ, నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో నామినేషన్లు కీలక ఘట్టమని, నామినేషన్ పత్రాలతో ప్రతి అంశాలు సరిగా ఉన్నాయో, లేవో జాగ్రత్తగా నిబంధనలు ప్రకారం చూడాలని తెలిపారు. వార్డు సభ్యుడు పోటీ కోసం అదేవార్డు సభ్యుడు ప్రపోజర్‌గా ఉండాలని అన్నారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, అప్పీళ్ల పరిష్కారం, గుర్తుల కేటాయింపు, పోటీ చేసే అభ్యర్థుల ప్రకటన పకడ్బంధీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల్లో పోటీ చేయదలుచుకున్న అభ్యర్థులకు సంబంధించిన కరపత్రాలు, గోడ పత్రాలు, ప్రచార వాహనాల అనుమతులను తీసుకోవాలంటే సంబంధిత అధికారులను సంప్రదించాలని తెలిపారు. అలాగే అభ్యర్థుల యొక్క అన్ని వివరాలు నామినేషన్ పత్రాలలో నమోదు చేసేందుకు అవగాహనకు హెల్ప్ డెస్క్‌లో నివృత్తి చేసుకోవచ్చని, ప్రతి చిన్న అంశాన్ని అనుమానాలకు తావులేకుండా పూర్తి స్థాయిలో తెలుసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పిల్లి రాంప్రసాద్, కమిషనర్ మున్వర్‌అలీ, ఎంపిడీఓ రవికుమార్ , ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**నామినేషన్ల స్వీకరణ కేంద్రాలు పరిశీలన...**

ఏదులాపురంమున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా వెంకటగిరి లోని నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను అడిషనల్ డీసీపీ లాఅండ్ ఆర్డర్ ప్రసాద్‌రావు సందర్శించి పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల సంఘం నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ నామినేషన్ల ప్రక్రియ బందోబస్త్ పకడ్బందీగా నిర్వహించాలని, ఎన్నికల విధుల పట్ల పోలీస్ అధికారులు పూర్తి అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సందర్భంగా కార్యాలయాల్లో నామినేషన్ స్వీకరణ ప్రక్రియను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు పోలీస్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా యూరియా అమ్మకాలు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలో యూరియా అమ్మకాలు ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా ప్రారంభమయ్యాయని జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత వానాకాలంలో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా యూరియా సరఫరా చేయాలనే ఉద్దేశంతో ఈ యాప్‌ను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఈ యాప్ యొక్క ముఖ్య ఉద్దేశం అవసరమైన ప్రతి రైతుకు పారదర్శకంగా అవసరమైన యూరియాను అందుబాటులో ఉంచటమన్నారు. క్యూలో రైతులు నిలబడి ఆందోళన చెందటాన్ని నిరోధించడం, ఎవరి వద్ద ఎంత యూరియా అందుబాటులో ఉందో తెలుసుకోవచ్చునన్నారు. ఈ యాప్ ద్వారా రైతులు జిల్లాలో అందుబాటులో ఉన్న యూరియాను వారి యొక్క పంట రకాన్ని, వారికి ఉన్న విస్తీర్ణాన్ని బట్టి ఏ డీలర్ నుంచైనా, ఏ సొసైటీ నుంచైనా బుకింగ్ ద్వారా కొనుగోలు చేసుకోవచ్చునన్నారు. ఒకసారి బుక్ చేసుకున్న తర్వాత 24 గంటల్లోపు ఆ రైతు బుక్ చేసుకున్న డీలర్ వద్దకు వెళ్లి కొనుగోలు చేయవచ్చునన్నారు. బుక్ చేసుకున్న తర్వాత యూరియా తీసుకోకపోతే ఆ బుకింగ్ రద్దవుతుందని మరల బుక్ చేసుకోవాలని తెలిపారు. కౌలు రైతులు కూడా ఈ యాప్‌లో యూరియాను బుక్ చేసుకోవచ్చని కౌలుకు తీసుకున్న పొలానికి సంబంధించి పట్టాదారు పాసుపుస్తకం ద్వారా బుక్ చేసుకోవాలని ఆ పట్టాదారు ఓటిపి చెప్పాల్సి ఉంటుందన్నారు. ఈ యాప్‌ను రైతులకు అలవాటు చేయడానికి, అవగాహన కల్పించడానికి ప్రతి అవుట్‌లెట్ల దగ్గర వ్యవసాయ శాఖాధికారిని నియమించడం జరుగుతుందని, ఏఈవోలు రైతులకు సహయ సహకరాలను అందిస్తారన్నారు. రైతులు తమ ఆండ్రాయిడ్ ఫోన్లలో ఈ యాప్‌ను ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని యూరియాను కొనుగోలు చేయాలని సూచించారు.

# మున్సిపల్ ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

**- డీఎస్పీ ఆర్. సతీష్‌కుమార్**



**ప్రజాపక్షం/అశ్వారావుపేట :** భద్రాది కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంగా నామినేషన్ ప్రక్రియ సజావుగా సాగేందుకు పోలీస్‌శాఖ పటిష్ట చర్యలు చేపట్టిందని డీఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. గురువారం అశ్వారావుపేటలో ఏర్పాటు చేసిన నామినేషన్ల సెంటర్లను స్వయంగా సందర్శించి భద్రతా ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. నామినేషన్ సెంటర్ల పరిసర ప్రాంతాల్లో పోలీస్ బందోబస్తు, రూట్ మ్యాప్, ట్రాఫిక్ నియంత్రణ, సిసి కెమెరాల ఏర్పాటు, మెటల్ డిటెక్టర్ల వినియోగం వంటి అంశాలపై డీఎస్పీ అధికారులతో సమీక్షించారు. అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే సమయంలో ఎలాంటి గందరగోళం, ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పోలీస్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భండా డీఎస్పి మాట్లాడుతూ అశ్వారావుపేట మున్సిపాలిటీలో జరుగనున్న ఎన్నికలు పూర్తిగా ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛాయుతంగా నిష్పక్షపాతంగా జరిగేలా పోలీస్‌శాఖ పూర్తి స్థాయిలో కృషి చేస్తోందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులులు, పోలీస్‌శాఖకు సహకరించి ఎన్నికల నిర్వహణను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఎక్కడైనా అనుమానాస్పద పరిస్థితులు కన్పిస్తే వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ నాగరాజు, ఎస్సై యయాతి రాజు, ఇతర పోలీస్ అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# త్రివేణి పాఠశాల డైరెక్టర్‌కు అత్యున్నత పురస్కారం




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** విద్యా రంగంలో విశేష కృషి చేస్తున్న త్రివేణి టాలెంట్ స్కూల్ డైరెక్టర్ డా॥ గొల్లపూడి వీరేంద్రచౌదరికి ప్రతిష్టాత్మకమైన రవీంద్రనాథ్ ఠాగూర్ నేషనల్ డైరెక్టర్స్ అవార్డు వరించింది. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ధృవీకరించిన ఈయు మీడియా ఆధ్వర్యంలో బెంగళూరులో నిర్వహించిన ఎడ్యుకేషన్ ఎక్స్‌లెన్స్ కాంక్లేవ్‌లో డా॥ గొల్లపూడి వీరేంద్రచౌదరికి రవీంద్రనాథ్ ఠాగూర్ నేషనల్ డైరెక్టర్ అవార్డును ప్రదానం చేశారు. విద్యా బోధనలో వినూత్న పంథాను అనుసరిస్తూ విద్యార్థుల సమగ్ర వికాసానికి త్రివేణి విద్యా సంస్థలు చేస్తున్న కృషిని గుర్తిస్తూ ఈ అవార్డును ప్రదానం చేశారు. త్రివేణి టాలెంట్ స్కూల్ ద్వారా ఐఐటి, నీట్ ఫౌండేషన్ కోర్సులు నాణ్యమైన విద్యను అందిస్తూ వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తున్నారు. చదువులోనే కాకుండా విద్యార్థులను అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దటమే తమ విద్యా సంస్థల లక్ష్యమని డా॥ వీరేంద్రచౌదరి తెలిపారు. వీరేంద్రచౌదరికి అవార్డు రావటం పట్ల పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.

# మీడియా కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పురపాలక ఎన్నికల మీడియా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి అనుదీప్ దురిశెట్టి ప్రారంభించారు. కలెక్టరేట్ మొదటి అంతస్తులో గల జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా కేంద్రాన్ని గురువారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రారంభించారు. పురపాలక ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో భాగంగా మీడియా కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల పత్రికా ప్రకటనలు, సోషల్ మీడియా ప్రచారం పై మీడియా కేంద్రం ద్వారా నిఘా పెట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్నికల సంబంధ సమాచారం మీడియాకు ఎప్పటికప్పుడు అందించాలని కలెక్టర్ తెలిపారు. ప్రింట్ మీడియాలో ప్రచార ఖర్చుపై నిఘా, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రచార అనుమతులకు జిల్లా మీడియా సర్టిఫికేషన్ అండ్ మీడియా మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పౌర సంబంధాల అధికారి ఎంఏ గౌస్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మీడియా మానిటరింగ్ కమిటీ సభ్యులు, కార్యాలయ టైపిస్ట్ కె. ప్రవల్లిక, కంప్యూటర్ ఆపరేటర్లు నవీన్, హరీష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇంచార్జి డిఆర్‌డివోగా కొండపల్లి శ్రీరామ్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఇంచార్జి డిఆర్‌డివోగా జిల్లా ఉపాధి కల్పనాధికారి కొండపల్లి శ్రీరామ్ బాధ్యతలు స్వీకరించారు. గురువారం కొండపల్లి శ్రీరామ్ ఇంచార్జి డిఆర్‌డివోగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలెక్టర్ చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజను కలిశారు.

# బ్లూమింగ్ మైండ్స్‌లో ఆస్ట్రోనాట్ సినిమా షూటింగ్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని బల్లేపల్లిలో గల బ్లూమింగ్ మైండ్స్ సెంట్రల్ స్కూల్, జూనియర్ కళాశాలలో ఆస్ట్రోనాట్ సినిమా షూటింగ్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సినిమాలో చైల్డ్ ఆర్టిస్ట్‌గా శంబాల సినిమా ఫేమ్ చైత్ర నటిస్తున్నారు. ఈ చిత్రంలో గీతాభాస్కర్‌తో పాటు హీరో, హీరోయిన్లుగా వరుణ్ సందేశ్, వితికా షేర్ నటిస్తున్న ఈ సినిమాకు కార్తీక్ భాగ్యరాజ్ దర్శకునిగా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కరస్పాండెంట్ పి. అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ఆస్ట్రోనాట్ సినిమా షూటింగ్ మా పాఠశాలలో జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సినిమా గొప్ప విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సమ్మక్క సారలమ్మలకు మేయర్ పూజలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని 17వ డివిజన్ శ్రీనివాస్ నగర్‌లో గల సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద మేయర్ పునుకొల్లు నీరజ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం మేయర్ పునుకొల్లు నీరజ సమ్మక్క సారలమ్మ లను దర్శించుకుని బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగర ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, అన్ని రంగాల్లో ఖమ్మం అభివృద్ధి చెందాలని అమ్మవార్లను ప్రార్థించినట్లు మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహరా, కార్పొరేటర్ ధనాల రాధ, మహిళలు, స్థానిక నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# యాప్ వినియోగంపై రైతులకు అవగాహన



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలోని ఎంవీ,పాలెంలో రైతుల సౌకర్యార్థం ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూరియా యాప్ వినియోగంపై రైతులకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏఓ ఉమా నాగేష్ గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ యాప్ ఎంతో సులభంగా ఉంటుందని, రైతులు క్యూలైన్లలో వేచి ఉండాల్సిన అవసరం లేకుండా తమకు కావలసిన యూరియాను బుక్ చేసుకొని సులువుగా పొందవచ్చని తెలిపారు. ఎరువుల పంపిణీలో పాదర్శకత పెంచడానికి ఈ యాప్ దోహదపడుతుందని, ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతులు యాప్ ద్వారా యూరియా బస్తాలు మొబైల్‌యాప్ ద్వారా బుక్ చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు వంశీ, ఆదర్శ్, నజ్మాకౌసర్, కావ్య, హిమబిందు, సొసైటీ బాధ్యులు అశోక్, నాగరాజు స్థానిక రైతులు పాల్గొన్నారు.

## సిపిఐ అభ్యర్థి సంజయ్ నామినేషన్



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** కాంగ్రె స్, సిపిఎం పార్టీలు బలపర్చిన 19వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా సిపిఐ అభ్యర్థి తిరునాటి సంజయ్ గురువారం పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. ఈ సంద ర్భంగా సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సయ్యద్ సలీం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తు న కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం సలీం మాట్లాడుతూ ఈ ప్రాంతంలో సిపిఐ కార్మికులు, కర్షకులు పేద మధ్య తరగతి ప్రజల కోసం నిరంతరం శ్రమించి పోరాడిందని అన్నారు. ముఖ్యంగా పట్టణంలోని వేలాది మంది ఇళ్ళ స్థలాలు లేని ప్రజలకు ఇంటి జాగా కల్పించిన ఏకైక పార్టీ సిపిఐ అన్నారు. పట్టణంలో పెద్ద ఎత్తన ప్రజల మద్దతు కూడగట్టి పొత్తుల్లో ఉన్న పార్టీల విజయం కోసం సిపిఐ కృషి చేస్తుందన్నారు. దీంతో పాటు 19వ వార్డు కౌన్సిల్ సభ్యులుగా పోటీ చేసిన సిపిఐ అభ్యర్థి విజయానికి సహకరించాలని ఓటర్లకు పార్టీ కార్యకర్తలు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఎఐటియూసి మండల అధ్యక్షులు పఠాన్‌జలాల్, పార్టీ శ్రేణులు, విజయ్‌కాంత్, చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

## చైర్‌పర్సన్ అభ్యర్థిగా నాగపద్మ నామినేషన్



**ప్రజాపక్షం/అశ్వారావుపేట :** అశ్వారావుపేట నూతనంగా ఏర్పడ్డ మున్సిపాలిటీకి బిఆర్ఎస్ పార్టీ నుండి చైర్మన్ అభ్యర్థిగా 8వ వార్డు నుంచి పోటీ చేస్తున్న కాసాని నాగపద్మ నామి నేషన్ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించగా ముఖ్యఅతి ధులుగా మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటే శ్వర్లు, మచ్చా నాగేశ్వరరావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కాసాని నాగపద్మ ఇంటి నుండి భారీ ప్రదర్శనగా బయలుదేరి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు మాట్లాడుతూ పది సంవత్సరాల టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి మున్సిపాలిటీ లో టిఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులను గెలిపిస్తాయని అన్నారు.ప్రజలకు నిత్యం అందుబాటు ఉండి శాసనసభ్యులుగా ఉన్న కాలంలో నియోజక వర్గంతో పాటు పట్టణ అభివృద్ధికి వందల కోట్ల నిధులు తెచ్చి అభివృద్ధి చేశామన్నారు. గతంలో చేసిన అభివృద్ధి కానీ ఇప్పుడు వచ్చిన ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏమి కనిపిం చడం లేదని పేర్కొన్నారు. టిఆర్ఎస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను కారు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. అనంతరం 8వ వార్డులో పోటీ చేస్తున్న అభ్యర్థి నాగప ద్మతో పాటు పలువురు అభ్యర్థులు నామినేసన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జూపల్లి రమణారావు, జూపల్లి పద్మజ, మాజీ ఎంపిపి జల పల్లి శ్రీరామ్మూర్తి, యువజన నాయకులు మోహన్ శ్రీరామూర్తి, హరికృష్ణ, జీవన్‌రావు తది తరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య సమరయోధుడు సీతయ్య మృతి



**ప్రజాపక్షం/చింతకాని :** నాగిలిగొండ గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధులు ఏపూరి సీతయ్య(70) బుధవారం రాత్రి అనారోగ్యంతో హైదరాబాద్ లో మరణించారు. సీతయ్య సాయుధ పోరాట కాలంలో కొరియర్ గా పనిచేసారు. 70 ఏండ్లుగా సిపిఐలో కొనసాగుతూ ఈ ప్రాంతంలో పార్టీ ఎదుగుదలకు ఎంతో కృషి చేశారు. పార్టీ పట్ల పూర్తి విశ్వాసంతో జివితకాలం పనిచేశారు. సీతయ్య అంత్యక్రియలు శుక్రవారం ఉదయం 10 గంటలకు నాగిలిగొండ గ్రామంలో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

## మంగళతండా అభివృద్ధి దిశగా బాటలు



**ప్రజాపక్షం/కారేపల్లి:** మంగళతండా గ్రామ పంచాయితీ సర్పంచ్ ధరావత్ వెంకటేశ్వర్లు గ్రామ పంచాయితీ అభివృద్ధి దిశగా బాటలు వేస్తున్నారు. గురు వారం గ్రామ పంచాయితీలోని ఏడగ వార్డులో కొన్ని నెలలుగా సైడ్ డ్రైనేజీలో పేరుకుపోయిన మట్టిని జెసిబి సహాయంతో తొలగించారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయితీ అభివృద్దే లక్ష్యంగా ప్రణాళికలతో తమ పాలకవర్గం ముందు కు సాగుతున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ బానోత్ మలుసూర్, సెక్రటరీ మోహన్ బాబు, వార్డు సభ్యులు ధరావత్ రాజశేఖర్, తేజవత్ ఉష, ధరావత్ రవీం దర్, ధరావత్ అంజయ్య, మల్టీ పర్పస్ ఎర్ర నాగులు వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# మూలన పడ్డ ఫాగింగ్ యంత్రాలు..!

**-పల్లెల్లో దోమల స్వైరవిహారం**
**-రోగాల బారిన పడుతున్న ప్రజలు**
**-పట్టించుకోని సంబంధిత అధికారులు**




**ప్రజాపక్షం-నేలకొండపల్లి :** జిల్లాలో 21 మండలాలు...571 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఫాగింగ్ యంత్రాలు మాత్రం కొద్ది పంచాయ తీలకు మాత్రమే ఉన్నాయి. దీంతో పంచాయతీలలో దోమలు స్వైరవి హారం చేస్తున్నాయి. ఉన్న ఫాగింగ్ మిషన్ లు కూడ చాలా వరకు మూలనపడ్డాయి. కొన్ని పంచాయతీలలో ఫాగింగ్ యంత్రాలు అద్దెకు తీసుకొచ్చి...మొక్కుబడిగా ఫాగింగ్ చేయించి చేతులు దులుపుకుంటు న్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతీ పంచాయతీలలో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. ప్రజలు రోగాల బారిన పడి ఆసుపత్రుల చుట్టూ తిరుగు తున్నారు. పలు పంచాయతీలో వివిధ రోగాలతో మంచం కే పరిమితమై తున్నారు. దీనికి తోడు ఖాళీ స్థలాలు ఉండటంతో దోమలు మరింత విజృంభిస్తున్నాయి. దీంతో ప్రతీ గూడెంలో జ్వరపీడితులు పెరుగుతు న్నారు. దోమల నియంత్రణ కు చర్యలు తీసుకోవాల్సిన పంచాయతీ పాలకులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు విన వస్తున్నాయి. పంచాయతీలలో ప్రస్తుతం అక్కడక్కడా ఫాగింగ్ చేస్తు న్నారు. చాలా పంచాయతీలలో ఫాగింగ్ ను అధికారులు పట్టించుకో వటం లేదు. ఫాగింగ్ ఉన్న పంచాయతీలలో మూలనపడేశారు. యంత్రాలు నిర్వహణ లేక మరమ్మతులకు నోచుకోవటం లేదు. దోమల నివారణ కు ఫాగింగ్ యంత్రాలు మూడేళ్ల క్రితం కొనుగోలు చేశారు. చిన్న పంచాయతీలు మాత్రం కొనుగోలు చేయలేదు. వారి అద్దెకు తీసు కొచ్చి అడపాదడపా చేయిస్తున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరా యంతో రాత్రిపూట ప్రజలు దోమలతో సతమతమవుతున్నారు. మురుగు కాల్వలలో పేరుకపోయిన మురుగు తో దోమలకు అవాసా లుగా మారాయి.

**వచ్చిన నిధులపై పంచాయతీల్లో లొల్లి....**

తాజాగా పంచాయతీలలో డబ్బులు జమ కావటంతో కొత్తగా ఎన్నికైన సర్పంచ్ లు, కార్యదర్శుల మధ్య లొల్లి నడుస్తుంది. గత రెండేళ్లగా పాల కవర్గాలు లేకపోవటంతో కార్యదర్శులు అందినకాడికల్లా అప్పులు తెచ్చి గ్రామాభివృద్ధి కోసం ఖర్చు చేశారు. కానీ నూతన సర్పంచ్ లు చాలా చోట్ల కొర్రి లు పెడుతున్నారని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ఖాతాలలో జమ అయిన నిధుల విషయంలో అధికార యంత్రాంగం ఏం చర్యలు తీసుకుంటుందని...కార్యదర్శులు ప్రశ్నిస్తు న్నారు.

**చర్యలు తీసుకుంటాం :**
**యం.యర్రయ్య, ఎంపీడీవో, నేలకొండపల్లి.**



ప్రతీ పంచాయతీలలో ఫాగింగ్ చర్యలు తీసు కుంటున్నాం. గ్రామాలలో పారిశుద్ధ్య సమ స్యలు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారించాం. దోమల బెడద నివారణకు ఫాగింగ్ యంత్రా లు వినియోగించేలా చర్యలు తీసుకుంటాం. ఎక్కడైనా పాడైన వాటిని మరమ్మతులు చేయించాలని ఆదేశాలు జారీ చేశాం.

**ఫాగింగ్ క్రమం తప్పకుండా చేపట్టాలి :**
**పసుమర్తి శ్రీనివాస్, సామాజిక కార్యకర్త, నేలకొండపల్లి.**



గ్రామాలలో దోమల నివారణ కు ఫాగింగ్ ను షెడ్యూల్ ప్రకారం చేయించాలి. ప్రతీ పంచా యతీలో ఫాగింగ్ యంత్రాం ఉండాల్సిందే. ప్రజల ఆరోగ్యాలను కాపాడాల్సిన బాధ్యత పాలకుల పై ఉంది. దోమల నివారణ చేయించే విషయంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# నూతన జాతీయ విద్యా విధానం రద్దుకై ఉద్యమిస్తాం

**ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్**

**ప్రజాపక్షం/చింతకాని :** నూతన జాతీయ విద్యా విధానం రద్దుకై విద్యా ర్థులు ఉద్యమించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మ ణ్ పిలుపునిచ్చారు. గురువారం చింతకాని మండలం నాగులవంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో లక్ష్మ ణ్ మాట్లాడుతూ నేడు దేశంలో నూతన విద్యావి ధానం పేరుతో యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తి దెబ్బ తీసే ప్రయత్నం చేస్తున్నారని ఆయన విమర్శించారు. యూనివర్శిటీలను మూడు నాలుగు రకాలుగా విభజన చేసి విద్యను కార్పొరేటీకరణ , ప్రైవేటీకరణ కాషాయికరణ చేస్తుందన్నారు. యూనివర్శిటీల్లో ఆరెఎస్ఎస్ భావాలు ఉన్నవారినే నియమిస్తున్నారకని అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగా నికి కనీసం 10శాతం బడ్జెట్ కేటాయింపులు చేయకుండా జీడీపీలో 6శాతం నిధులు కేటాయించకుండా ఎలా నూతన విద్యావిదానం




అమలు చేస్తారని ప్రశ్నించారు. దేశ చరిత్రను సాయుదపోరాట వాస్తవా లను బిజేపి వక్రీకరిస్తుందన్నారు. అనంతరం 21 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు షేక్ నాగులమీరా, నవీన్ సాయి తదితరులు పాల్గొన్నారు.

# మధిర మున్సిపాలిటీలో నామినేషన్లు షురూ..








**- బిజెపి 7, బిఆర్ఎస్ 5, సిపిఎం 2, జనసేన 1 నామినేషన్లు దాఖలు**

**ప్రజాపక్షం/ మధిర :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో ప్రతిష్టాత్మ కంగా జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా మధిర మున్సిపా ల్టీలో రెండవరోజు గురువారం నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. మున్సి పల్ ఎన్నికలు సందర్భంగా మొదటి రోజు బుధవారం నామినేషన్లు వేయకపోవడం విశేషం. రెండవరోజు మధిర మున్సిపాల్టీలో బిజెపి నుండి 7నామినేషన్లు, బిఆర్ఎస్, సిపిఎం కూటమి నుండి 7 నామినే షన్లు, జనసేన పార్టీ నుండి 1 నామినేషన్ దాఖలు అయినట్లు అధికా రులు తెలిపారు. బిజెపి పార్టీ నుండి 1వ వార్డుకు పగిడిపల్లి విజయమ్మ, 4వ వార్డుకు కుంచం మల్లేశ్వరి, 6వవార్డుకు పగడాల యామిని, 7వ వార్డుకు దుగ్గిదేవర మణికంఠ, 10వ వార్డుకు పాపట్ల రమేష్, 15వ వార్డుకు బొడ్డు సరిత, 18వ వార్డుకు చక్రవర్తుల వరదరాజన్ నామినే షన్లు వేశారు. అదేవిధంగా బిఆర్ఎస్ పార్టీ నుండి 6వార్డుకు నీలం ఆమల, 2వ వార్డుకు ధీరావత్ మాధవి, గుగులోత్ కృష్ణా నాయక్, 17వ వార్డుకు అంగడాల పార్వతీ, 21వ వార్డుకు పరిశ నాగలక్ష్మి , బిఆర్ఎస్ బలపర్చిన సిపిఎం పార్టీ నుండి 9వ వార్డుకు డాక్టర్ రవికిషోర్ సతీమణి కస్తూరిభాయి, 18వ వార్డుకు పంతంగి నాగయ్య నామినేషన్లు వేశారు. అదేవిధంగా మధిర మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా 17వ వార్డు జనసేన పార్టీ అభ్యర్థిగా ఆ పార్టీ కోఆర్డినేటర్ అనంత శివరామకృష్ణ నామినేషన్ దాఖలు చేశారు. అయితే రెండవరోజు కూడా అధికార కాంగ్రెస్, టిడిపి, సిపిఐ కూటమి నుండి ఒక నామినేషన్‌కూడా దాఖలు కాకపో వడం గమనార్హం. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల ముఖ్య నాయ కులు, మద్దతుదారులు తదితరులు పాల్గొన్నారు.

# పేరుకు కిరాణం.. అమ్మేది మద్యం..!

**-పల్లెల్లో బార్లను తలపిస్తున్న బెల్టుషాపులు**
**-ఖాళీ అవుతున్న మద్యం ప్రియుల జేబులు**
**-చోద్యం చూస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు**







**ప్రజాపక్షం/జూలూరుపాడు:** గ్రామాల్లో గల్లీ గల్లీకో బెల్ట్ షాపు ఏర్పా టు చేసి మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. అయిన కూడా సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులు మాకు ఏమీ సంబంధం లేనట్లుగా, చూసీచూ డనట్లుగా వ్యవహరిస్తున్నారు. బెల్ట్ షాపుల నిర్వహణ వల్ల రిటైల్ మ ద్యం షాపుల వ్యాపారాలకు అడ్డగోలుగా లాభాలు వస్తున్నాయి. మండ లవ్యాప్తంగా పల్లెలో బెల్టు షాపులు దందా జోరుగా కోన సాగుతోంది.

**నిబంధనలకు విరుద్ధంగా బెల్టుషాపులు..**

నిబంధనలకు విరుద్ధంగా గల్లీ గల్లీకో బెల్ట్ షాపు ఏర్పాటు చేసి అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారు. అనేకమంది నిరుపేదలు బెల్టు షాపుల్లో మద్యం కొనుగోలు చేసి జేబులు గుల్ల చేసుకుంటున్నారు. అప్పులు చేసి తాగడంతో కాపురాలు వీధి పాలు అవుతున్నాయి. వైన్ షాప్ కు నిత్యం వచ్చే మద్యం ప్రియులకు ఎమ్మార్పీ ధరలకు అమ్మ కాలు చేస్తున్నారు. కానీ సిండికేట్ కారణంతో విచ్చలవిడిగా పెరిగిపో తున్న బెల్ట్ షాప్ నిర్వాహకుల వల్ల క్వాటర్ రూ.40 లు హాఫ్ పై రూ.60. లు ఫుల్ పై కనీసం 120 అదనంగా వసూలు చేస్తున్నారు. వైన్ షాపుల్లో లేని బ్రాండ్లు బెల్ట్ షాప్ లో ఉంచడం గమనార్హం. ప్రతి ఒక గ్రామంలో వీధి వీధికి బెల్ట్ షాప్ వెలపటంతో అంతర్యమేమిటో అర్థం కాని పరిస్థితి, ఒక్కమాటలో చెప్పాలంటే సంబంధిత అధికారులు, బెట్టు షాపులు నిర్వాహకులను పెంచి పోషించినట్లుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జూలూరుపాడు మండలం మొత్తం 24 గ్రామ పంచాయతీలు ఉండగా మొత్తం గ్రామపంచాయతీల్లో సుమారు 100 కి పైగా బెల్టుషాపులు నిర్వాహకులు బెల్టుషాపులు నడుపుతు న్నారు. రాత్రి సమయంలో గ్రామాలలో ఏ బెల్ట్ షాపు తలుపు తట్టిన చాలు (ఏటీఎం) లాగా కావలసిన మద్యం ప్రత్యక్షం అవుతుంది. ధర ఎంతైనా పర్వాలేదు అన్నట్లుగా మద్యం ప్రియులు వ్యవహారం ఉంది

**పెడదారి పడుతున్న యువత..**

గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టుపాపులు నిర్వహణతో ప్రధానంగా యువ త పెడదారిలో ప్రయాణిస్తుంది. ఎంతో విలువైన తమ భవిష్యత్తును అబాసుపాలు చేసుకుంటున్నారు. గ్రామాల్లో రాత్రి మద్యం అమ్మకాలు చేయడం వల్ల యువత మద్యం మత్తులో ఏం చేస్తున్నారో అర్థం కాకుం డా అయిపోయింది. కొన్ని సందర్భాల్లో తమ విలువైన ప్రాణాలను కూడా యువత పోగొట్టుకున్న సంఘటనలు ఉన్నాయి

**పేరుకు కిరాణం..**

అమ్మేది మద్యంమండలంలోని పలు గ్రామాల్లో ఎక్కువమంది పేరుకు కిరాణా దుకాణాలు నిర్వహిస్తూ లోపల మాత్రం మద్యం వ్యాపారం చేస్తున్నారు. సొంత ఇళ్లలో విక్రయిస్తున్నారు. దుకాణం దగ్గర మద్యం సేవించి ఇళ్ల మధ్యలో గొడవలు పడుతూ అర్ధరాత్రి వరకు నానా రభస చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రతి గ్రామంలో లో బెల్టుషా పుల కారణంగా మద్యం ఏరులై పారుతుంది. పచ్చని సంసారంలో మద్యం చిచ్చువిచ్చలవిడిగా గ్రామాల్లో దొరుకుతున్న మద్యం పచ్చని సంసారంలో చిచ్చు పెడుతోంది. దీంతో పొద్దంతా పని చేసి సంపాదిం చిన సొమ్మును మద్యానికి వేచిస్తూ కుటుంబాలను వీధిన పడేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో భార్య భర్తలు గొడవలు పడి మద్యం మత్తులో క్షణికా వేశం లో ఏమి జరిగింది. అనే తెలుసుకునే లోపు కుటుంబంలో ఉన్న వ్యక్తులు అనాథలుగా మారిపోతున్నారు.

**ఎనీ టైం మందు (ఏటీఎం) మద్యం కావాలా..**

అయితే సమయంతో పని లేదు. ఏ సమయంలోనైనా మద్యం అందుబాటులో ఉంటుంది. ఏదైనా పండుగ వస్తే గల్లీ మొత్తం జాతరను తలపించే విధంగా రద్దీగా ఉంటుంది. ఏ బ్రాండ్ మద్యం అయినా సరే, ఒక్కో బ్రాండ్ ఒక్కో రేటు తో మద్యం అమ్మకాలు ఇక్కడ జరుగు తాయి. ఎక్సైజ్ నిబంధనలు వర్తించవు. ఎందుకంటే వారు చెప్పిందే రేటు ఆ రేట్ మద్యం విక్రయిస్తారు. ఇదేమిటని అడిగితే అది అంతే ఇష్టం ఉంటే తీసుకో లేదంటే మానుకో. అని దురుసుగా సమాధానం ఇస్తారు. అధిక ధరలతో మద్యం అమ్మకాలు జరిపి మద్యం ప్రియుల జేబులకు చిల్లులు పొడుస్తున్నారు. ఈ తతంగమంతా మండల పరిధిలోని గ్రామాలలో నిత్యం జరుగుతుంది.

**పట్టించుకోని అధికారులు..**

గ్రామాల్లో మద్యం అమ్మకాలు సిండికేట్ గా మారడం తో బెల్టుషాపులు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. హూటల్ లు కిరాణా షాపులు, బెల్టు షాపులుగా తయారవుతున్నాయి. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు లాభార్జనదేగా గ్రామీణ ప్రాంతాల వారికి విక్రయిస్తున్నారు. మద్యం షాపులు రహదారుల పక్క న నిర్వహించరాదని అధికారికంగా వెల్లడించినప్పటికి గ్రామాల్లో రోడ్డు పక్కన దర్జాగామద్యం విక్రయిన్నా సంబంధిత అధికారులు మామూళ్ల మత్తులో ఉండి పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# క్రీడలు మానసికోల్లాసానికి దోహదం : ఎంపిడిఓ



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయ ని ఎంపీడీవో జములారెడ్డి అన్నారు. బూర్గంపాడు మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాల ఆవరణలో సీఎం కప్ మండల స్థాయి పోటీలు గురువారం ఉదయం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సీఎం కప్‌లో మండలంలోని నాలుగు క్లస్టర్లుగా ఏర్పాటు చేసి బూర్గంపాడు, సారపాక, మోరంపల్లిబంజర్, పినపాక పట్టినగర్‌లను క్లస్టర్ల వారీగా అండర్ 18 కబడ్డీ, కోకో, వాలీ బాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి మండల స్థాయిలో పోటీలలు నిర్వహించారు. ఈ పోటీలను తహసీల్దార్ కేఆర్‌కే ప్రసాద్, ఎస్ఐ మేడా ప్రసాద్‌లతో కలిసి ఆయన ప్రారంభిం చారు. సారపాక, బూర్గంపాడు, మోరంపల్లిబంజర్, పినపాకపట్టి నగర్ క్లస్టర్ల పరిధిలో అండర్ 18 విభాగంలో మండల స్థాయిలో కబడ్డీ, కోకో, వాలీబాల్ నిర్వహించిన ఆటలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గ్రామ స్థాయిలో క్రీడలలో యువత రాణించాలనే సదుద్దేశంతో సీఎం కప్ ప్రారంభించారని, ఈ కప్‌లో భాగంగా పంచాయితీల వారీగా అండర్ 18 విభాగం వరకు యువత రిజిస్ట్రేషన్ చేయించుకున్న కళాశాలలో చదువుతున్న విద్యా ర్ధిని, విద్యార్ధులకు ఆటల పోటీలను క్లస్టర్ల వారీగా నిర్వహించడం జరిగింద న్నారు. క్లస్టర్ల వారీగా గెలుపొందిన వారిని మండల స్థాయిలో ఆడించా మని, మండల స్థాయిలో గెలుపొందిన వారు డివిజన్ , జిల్లా స్థాయిలో ఆడాల్సి ఉంటుందని తెలిపారు. ఆ ఆటల పోటీ లలో కోకో బాలికల విభాగంలో మొదటి బహుమతి బూర్గంపాడు, రెండవ బహుమతి సారపాక, కోకో బాలుర విభాగంలో మొదటి బహు మతి పినపాక పట్టినగర్, రెండవ బహుమతి బూర్గంపాడు, కబడ్డీ బాలి కల విభాగంలో మొదటి బహుమతి బూర్గంపాడు, రెండవ బహుమతి మోరంపల్లిబంజర్, కాబడ్డీ బాలుర విభాగంలో మొదటి బహుమతి పిన పాకపట్టినగర్, రెండవ బహుమతి మోరంపల్లిబంజర్, వాలీబాల్ బాలుర విభాగంలో మొదటి బహుమతి బూర్గంపాడు, రెండవ బహు మతి సారపాక, వాలీబాల్ బాలికల విభాగంలో మొదటి బహుమతి బూర్గంపాడు, రెండో బహుమతి మోరంపల్లిబంజర్‌లు సాధించాయి. ఈకార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మంద నాగరాజు, కోయగూడెం సర్పంచ్ కుంజ కొండమ్మ, ముసలిమడుగు సర్పంచ్ పుణేం సురేందర్, స్థానిక పంచాయితీ కార్యదర్శి బర్ల ప్రభాకర్, పీఈటీలు కృష్ణ, జనార్ధన్, పూర్ణచంద్రరావు, వెంకటనారాయణ, మల్లికార్జున్, బాలక్రిష్ణ, నాగ లక్ష్మీ , శశికళ, బాబురావులు పాల్గొన్నారు.

## ట్రస్ట్ క్యాలెండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వ ర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. గురువారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో జరి గిన కార్యక్రమంలో ట్రస్ట్ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను గ్రంథా లయ కార్యదర్శి కాళంగి కరుణకుమారి, ట్రస్ట్ చైర్మన్ పరిశ పుల్లయ్య లు ఆవిష్క రించారు. ట్రస్ట్ ద్వారా నిరుపేద విద్యార్థుల ఉన్నత విద్యకు చేయూతనివ్వడం అభినందనీ యమన్నారు. ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని ఆమె తెలిపారు.ఈ కార్యక్ర మంలో ఎస్‌జిపిఏటి జిల్లా సంయుక్త అధ్యక్షులు కనపర్తి వెంకటేశ్వర్లు, గ్రంథాలయ సిబ్బంది భాస్కర్, అఖిల్, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మండల పరిధిలోని రేగులచలక గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పనులను ప్రారంభించారు. గురు వారం పనులను సర్పంచ్ యండ పల్లి రమాదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పనులను సద్విని యోగం చేసుకోవాలని కూలీలకు సూచించారు. నిబంధనల మేరకు పనులు చేపట్టి రోజు వారి వేతనం తీసుకోవాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు యండపల్లి జగ న్మోహన్, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## విజయకు నివాళులర్పించిన మాజీ మంత్రి పువ్వాడ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగ రంలోని 53వ డివిజన్ ద్వారకానగర్ ప్రాంతా నికి చెందిన ముండ్ల ప్రసాద్ సతీమణి ముండ్ల విజయ గురువారం గుండెపోటుతో మరణిం చారు. ఆమె పార్థీవ దేహాన్ని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సందర్శించి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. విజయ ఆత్మకు శాంతి చేకూరాలని దేవున్ని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పగడాల శ్రీవిద్య, బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కర్నాటి కృష్ణ, మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళి, నంబూరి సత్యనారాయణ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

## క్రీడాకారులకు సర్టిఫికెట్ల అందజేత



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సీఎం కప్ 2026 నిర్వహణ రెండవ రోజులో భాగంగా జగ న్నాథపురం, పాత గంగారం, పొగళ్లపల్లి, ములకలపల్లి పంచాయితీల నుండి వచ్చిన క్రీడాకారులకు వాలీబాల్ సీనియర్స్, కబడ్డీ సీనియర్స్, కోకో జూనియర్స్‌కు క్రీడలను నిర్వహించారు. ఈ పోటీలలో వాలీబాల్ సీని యర్స్ విభాగంలో మొదటి స్థానం జగన్నాథపురం, రెండవ స్థానం, కబడ్డీ సీనియర్స్ విభా గంలో మొదటిస్థానం, ములకలపల్లి రెండవ స్థానం పొగళ్లపల్లి, కోకో జూనియర్స్ విభా గంలో మొదటి స్థానం, ములకలపల్లి రెండవ స్థానం జగన్నాథపురం గెలుపొందడం జరి గింది. గెలుపొందిన క్రీడాకారులకు మండల స్థాయి అధికారులచే సర్టిఫికెట్లను అందజే శారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, ఎంపీడీవో డి రామారావు, మండల విద్యాశాఖాధికారి జి సత్యనారాయణ, ఎస్ఐ మధు ప్రసాద్, పీఈటీ, పీడీ రాంబాబు, సురేష్, అధికారులు, క్రీడాకారులు, క్రీడాభిమానులు, పాల్గొన్నారు.

## బొలెరోను ఢీకొని ఇరువురికి తీవ్ర గాయాలు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** రోడ్డు ప్రమాదంలో ఇరువురుకు తీవ్ర గాయా లైన ఘటన మండలం లో చోటు చేసు కుంది. స్థానికుల కథనం ప్రకారం వివ రాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండల కేంద్రం లోని (కోనాయి గూడెం) అండర్ పాస్ వద్ద బొలెరో వాహనం బైక్ ను ఢీకొట్టింది. ఖమ్మం నుంచి నేలకొండపల్లి వస్తున్న బోలోరా వాహనం, నేలకొండపల్లి నుంచి ఖమ్మం వెళ్లేందుకు హైవే సర్వీస్ రోడ్డు వైపు వెళ్తున్న బైక్ ను అండర్ పాస్ వద్ద ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజస్థాన్ కు చెందిన వినాయక విగ్రహాల తయారీదారుడు కైలాస్, ఖమ్మం కు చెందిన రాజ శేఖర్ లకు తీవ్ర గాయాలైయ్యాయి. వీరిని స్థానికులు నేలకొండపల్లి ప్రభుత్వ హస్పిటల్ లో ప్రధమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం బమ్మం తరలించారు.

# కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారు..

**-బిఆర్ఎస్, సిపిఎం కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించండి**
**-బిఆర్ఎస్ నేతలు పువ్వాడ, నామ**





**ప్రజాపక్షం/వైరా:** కాంగ్రెస్ మోసపూరిత హామీలకు ప్రజలే బుద్ధి చెబుతారని తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. వైరా మున్సిపాలిటీ ఎన్నికల్లో బిఆర్ఎస్, సిపిఎం కైవసం చేసుకునేందుకు ప్రతి కార్యకర్త, సైనికుల్లా పనిచేయాలని కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత వాగ్దానాల కార్డును ఆయన ఆవిష్కరించారు. గురువారం వైరా మున్సిపాలిటీ బిఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బాకీ పడ్డ మహాలక్ష్మి, కళ్యాణలక్ష్మి, నిరుద్యోగ భృతి, విద్యార్థులకు స్కూటీలు వంటి ఉత్త హామీలు ఇచ్చి హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని, 25 నెలల కాలంలో ఇచ్చిన 6 గ్యారంటీల్లో ఒక్క ఉచిత బస్సు తప్ప మిగతా హామీలు ఒకటి కూడా నెరవేర్చడం లేదని ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. మున్సిపాల్ ఎన్నికల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చడం లేదని ఇంటింటికి బాకీ కార్డు ఇచ్చి ప్రచారం నిర్వహించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతుందని, అభివృద్ధిలో శూన్యమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను ఇప్పటికి నిర్వహిస్తున్నారని, అంతకు మించి రాష్ట్ర అభిబుద్ధిలో ఏ మాత్రం ముందకు పోవడం లేదని అన్నారు. అనంతరం మాజీ ఎంపి నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ కెసిఆర్ హయాంలోనే తెలంగాణలోని ప్రత ఇమున్సిపాలిటీ అభివృద్ధి పథంలో ఉందని, అవి అభివృద్ధి పనులు నిర్వహిస్తుందని, రూ.100కోట్ల అభివృద్ధి నిధులతో వైరా మున్సిపాలిటీని సుందర మున్సిపాలిటీగా ఏర్పాటు చేసేందుకు కెసిఆర్ బాటలు వేశారని అన్నారు. ముఖ్యమంత్రి ప్రతిపక్ష నేత కెసిఆర్‌పై తిట్ల పురాణం సిగ్గుచేటని స్థాయిని మించి మాట్లాడటం తగదని అన్నారు. ఎమ్మెల్సీ తాతా మదుసూదన్‌రావు మాట్లాడుతూ అభివృద్ధి అంటేనే బిఆర్ఎస్ అని, బిఆర్ఎస్‌కు, సిపిఎంకు ఓటు వేసి వైరా మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, వైరా మాజీ శాసనసభ్యురాలు డాక్టర్ బానోతు చంద్రావతి, మంజుల మదన్‌లాల్, లకావత్ గిరిబాబు, సిపిఎం వైరా నియోజకవర్గ కార్యదర్శి భూక్యా వీరభద్రం, బచ్చు విజయ్‌కుమార్, పగడాల నాగరాజు, వనమా విశ్వేశ్వరరావు, కట్టా కృష్ణార్జున్‌రావు, బాణాల వెంకటేశ్వర్లు, మద్దెల రవి, కామినేని శ్రీనివాసరావు, మున్సిపాల్ చైర్మన్ అభ్యర్థి కట్టా స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

# మధిర మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరవేస్తాం





**ప్రజాపక్షం/ మధిర :** మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా మధిర మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ జెండాను ఎగురవేస్తామని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎంపి నామ నాగేశ్వరావు అన్నారు. గురువారం మధిరలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ జెడ్పి చైర్మన్ లింగాల కమల్‌రాజు ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించగా వారితో పాటు మాజీ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు మాట్లాడారు. గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలోనే మధిర మున్సిపాల్టీ అభివృద్ధి జరిగిందని, మధిర మున్సిపాల్టీని డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. మధిర నియోజకవర్గంలో ఏ గ్రామంలోనైనా పూర్తిస్థాయిలో రుణమాఫీ కాలేదని, అదేవిధంగా ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. మధిర మున్సిపల్ ఎన్నికల్లో ఓటమి భయంతోనే అధికార కాంగ్రెస్ పార్టీ కుయుక్తులు పన్నుతున్నారని, పోటీలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల ఇంటికి రాత్రి వేళలో కొందర్ని పంపించి బెదిరింపులకు పాల్పడటం మంచి పద్ధని కాదన్నారు. బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను కాంగ్రెస్ పార్టీ డబ్బులు పెట్టి కొనుకుంటున్నారని, మీరు అభివృద్ధి చేస్తే మీకు ఈ పరిస్థితి ఎందుకు వస్తుందని ప్రశ్నించారు. మీ అదిరింపులకు, బెదిరింపులకు భయపడే వారు ఎవరూ లేరన్నారు. గత రెండేళ్ల కాంగ్రెస్ పాలన మధిర మున్సిపాల్టీలో ఏమి అభివృద్ధి జరుగలేదని, కేవలం కోట్ల రూపాయ నిధులు మంజూరు చేసినట్లు ప్రకటనలు, శిలాఫలకాలే తప్పా అభివృద్ధి శూన్యమని, దీంతో ప్రజల్లో కాంగ్రెస్‌పై చాలా వ్యతిరేకత వచ్చిందన్నారు. గత పదే ళ్ళ కాలంలోనే మధిర మున్సిపాల్టీ అభివృద్ధి చెందిందని, మధిర మున్సిపాల్టీని అభివృద్ధి చేసిన బిఆర్ఎస్, సిపిఎం కూటమికే ప్రజలు పట్టం కాడుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మహాశివరాత్రి ఏర్పాట్లను పూర్తి చేయాలి

**-భక్తులకు ఎలాంటి ఇబ్బంది రావద్దు**
**-గోడపత్రికను ఆవిష్కరించిన ఎమ్మెల్యే రాందాస్‌నాయక్**



**ప్రజాపక్షం/వైరా:** ఫిబ్రవరిలో జరిగే మహాశివరాత్రి సందర్భంగా స్నానాల లక్ష్మీ పురం గ్రామంలోని రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని గురువారం ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, అర్చకులు వేదమంత్రాలతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని భక్తులకు ఇబ్బంది కలిగించవద్దని ఆయన అధికారులు ఆదేశించారు. ఈ సందర్భంగా మహాశివరాత్రి గోడపత్రికను ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ఆవిష్కరించారు. డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క మల్లు సతీసమేతంగా కళ్యాణానికి వస్తున్నారు. జాతర సజావుగా సుమారు 2లక్షల మంది జనాభా ఈ జాతరకు వస్తారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాల్సిన బాధ్యత మీపై ఉందని ఎక్కడ నిర్లక్ష్యం వహించవద్దని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ, జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, గ్రామ పంచాయతీ సర్పంచ్ నూతి వెంకటేశ్వర్లు, దొడ్డా పుల్లయ్య, మల్లు రామకృష్ణ, దేవాల ధర్మకర్తలు, ఉప సర్పంచ్ అమ్మిక వెంకటేశ్వరరావు, అధికారులు తహాశీల్దార్ సురేష్, ఆలయాల ఈవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# కౌన్సిలర్ అభ్యర్థిగా ఫణితి సైదులు నామినేషన్




**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు కాంగ్రెస్ పార్టీ పట్టణ కాంగ్రెస్ నాయకులు మాజీ కౌన్సిలర్ ఫనితి ఉష భర్త ఫణితి సైదులు గురువారం ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ దాఖలు చేశారు. ఫణితి సైదులు నామినేషన్ కార్యక్రమానికి యువత పెద్ద ఎత్తున తరలివచ్చింది. ఈ కార్యక్రమంలో పోటు మధుసూదన్‌రావు, సరిపుడి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# నామినేషన్ దాఖలు చేసిన ఆదూరి రాధ



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలో 20వ వార్డులో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ దాఖలు చేసిన ఆదూరి ప్రేమ్ కుమార్ సతీమణి ఆదూరి రాధ. ఈ కార్యక్రమంలో మెదరమెట్ల రాము, పాముల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# గొల్లమందల విజిత విజయ్‌కుమార్ నామినేషన్




**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని బిఆర్ఎస్ పార్టీ 20వ వార్డు అభ్యర్థిగా వైరా నమస్తే తెలంగాణ రిపోర్టర్ గొల్లమందల విజయ్ కుమార్ సతీమణి గొల్లమందల విజిత గురువారం రిటర్నింగ్ అధికారికి నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో గొల్లమందల బాబు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థిగా కట్టా స్వరూపరాణి నామినేషన్



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ బిఆర్ఎస్ పార్టీ చైర్‌పర్సన్ అభ్యర్థి కట్టా స్వరూపరాణి గురువారం 5వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా ఎన్నికల రిటర్నింగ్ అధికారికి వెటర్నిహాస్పిటల్ నందు నామినేషన్ దాఖలు చేశారు. మాజీ ఎంపిపి జిల్లా బిఆర్ఎస్ నాయకులు కట్టా కృష్ణార్జున్‌రావు సతీమణి కట్టా స్వరూపరాణి నామినేషన్ కార్యక్రమంలో జిల్లా బిఆర్ఎస్ నాయకులు, వర్తక సంఘం అధ్యక్షులు వనమా విశ్వేశ్వరరావు, నూకల వాసు, కట్టా శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల కనీస అవసరాన్ని తీర్చండి

**పబ్లిక్ టాయిలెట్, బస్ షెల్టర్ నిర్మించండి**

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** మండల కేంద్రంలో పబ్లిక్ టాయిలెట్స్ బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని భారతీయ గోర్ బంజారా పోరాట సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు బానోత్ దుర్గాప్రసాద్ నాయక్ ఓ ప్రకటలో కోరారు. ఈ సందర్భంగా దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ మండల పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు నిత్యం ప్రభుత్వ కార్యాలకు వ్యాపార సముదాయాలకు అనేక పనులపై వస్తూ ఉంటారని వారి కనీస అవసరాలకు పబ్లిక్ టాయిలెట్స్ లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. దూర ప్రాణికుల కొరకు బస్సు కొరకు వేచి చూసే ప్రయాణికులు మహిళలు వృద్ధులు, చిన్న పిల్లలు పబ్లిక్ టాయిలెట్స్ లేక ఇబ్బందులకు గురి అవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రం మొత్తం వ్యాపార సముదాయాలకు రద్దీగా ఉంటుందని దీంతో ప్రజలు కనీసం అవసరమైన టాయిలెట్ కొరకు అవస్థలు పడుతున్నారని ఆయన అన్నారు. మండల కేంద్రంలో పబ్లిక్ టాలెంట్ నిర్మిస్తే ప్రయాణికులకు ప్రజలకు ఇబ్బందులు ఉండవని జూలూరుపాడు మండల కేంద్రంలో పబ్లిక్ టాలెంట్ నిర్మించేలాగా కృషి చేయాలని ఆయన కోరారు. మండల ప్రధాన సెంటర్లో బస్ షెల్టర్ లేక ప్రయాణికులు ఎండలో వర్షంలో నిలబడి ఉండాల్సి వస్తుందని ఖమ్మం వైపు భద్రాచలం వైపుకు బస్ కొరకు ఎదురు చూసే సమయంలో బస్ షెల్టర్ లేక ఎండకు ఎండుతున్నారని వర్షానికి తడుస్తూ బస్సుల కోసం నిలబడి చూడాల్సి వస్తుందని ఆయన వివరించారు. బస్ షెల్టర్ నిర్మిస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని తక్షణమే మండల కేంద్రంలో పబ్లిక్ టాయిలెట్ బస్సు షెల్టర్ నిర్మించడానికి అధికారులు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఆయన కోరారు.